
సాక్షి ఒడిశా

బుధవారం । 25 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,52,370లు, బంగారం 2 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 350 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

యువతి అనుమానాస్పద మృతి

- 8లో





ఘనంగా బాలికల దినోత్సవం

- 8లో

న్యూస్‌రీల్

చెట్టుని ఢీకొన్న కారు

- ఒకరు మృతి



ప్రమాదానికి గురైన ఎస్‌యూవీ వాహనం

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లా గోవింద్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్లాఖమాన్ సమీపంలో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఎస్‌యూవీ వాహనం చెట్టుని ఢీకొంది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా, వారిలో ఒకరు సజీవ దహనం అయ్యారు. జార్ఖండ్ రాంచీ సమీపంలోని సిమ్‌డేగా నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. అధిక వేగంతో కారు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గాయపడిన బాధితులను స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. వీరందరి చికిత్స కొనసాగుతోంది.

నాటుసారా పట్టివేత



సీజ్ చేసిన సారా డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: స్థానిక సదరు పోలీసుస్టేషన్ పరిధి జయపురం సమితి బాలియ గ్రామ పంచాయతీ నీలాగుడ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీకి సిద్ధం చేసిన ఇప్ప ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారి సంజయ కుమార్ కండి సోమవారం తెలియజేశారు. దాడుల్లో 80 లీటర్ల నాటుసారాతో పాటు 1400 లీటర్ల ఇప్ప ఊట ధ్వసం చేశామని, వాటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

330 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

జయపురం: కొరాపుట్ జిల్లా లమతాపుట్ ప్రాంతం నుంచి హర్యానాకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జయపురం సదర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఐ ఆర్.కె.బారిక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది సోమవారం సాయంత్రం విజయవాడ-రాంచీ 326 జాతీయ కారిడార్‌లోని పాత్రోపుట్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఒక కారు, ఒక టిప్పర్‌లో అనుమానంతో తనిఖీల నిర్వహించారు. ఈ వాహనాల్లో పెద్ద ఎత్తున గంజాయి బస్తాలు బయటపడ్డాయి. దీంతో రెండు వాహనాల్లో ఉన్నటువంటి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బొయిపరిగుడ సమితి లెంజ గ్రామం భిభీషణ మచ్చ((25), మల్కన్‌గిరి జిల్లా బలిమెల నివాసి జొగా సెట్టి(19), బలిమెల వాసి సునీల్ కుమార్ నాయిక్ (22)లు కాగా, మిగతా నలుగురు హర్యానాకు చెందిన బాదల్(18), శతపాల్(34), శ్రీపాల్(30), దిలీప్ సింగ్(34లు అని వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.33 లక్షలు ఉంటుందని తెలియజేశారు. నిందితుల నుంచి 6 సెల్ ఫోన్లు, రూ.22,199లు స్వాధీనం చేసుకున్న చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆపదలో రక్తదానం



రక్తదానం చేస్తున్న రాం పండా

కొరాపుట్: సకాలంలో ఒక గర్భిణికి ప్రభుత్వ ఉద్యోగి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఒక గర్భిణికి అత్యవసరంగా బీ-పాజిటివ్ రక్తం అవసరమయ్యింది. అయితే ఆ గ్రూప్ రక్త నిల్వలు లభించలేదు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో ఆస్పత్రి సమీపంలో ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న రాం పండా గమనించారు. వెంటనే అస్పత్రికి వెళ్లి రక్తదానం చేసి ఆమెను కాపాడారు. రాం పండా ఇప్పటివరకు అత్యవసర సమయాల్లో 66 సార్లు రక్తదానం చేయడం గమనార్హం. దీంతో ఆయనను తోటి ఉద్యోగులు, స్థానికులు అభినందించారు.



మహాత్మాగాంధీ మార్గంలో పోలీసు దళాల పరేడ్ సాధన చేస్తున్న దృశ్యం

గణతంత్ర వేడుకలకు సన్నద్ధం

- గాంధీ మార్గ్‌లో పరేడ్ రిహార్సల్

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహాలతో స్థానిక గాంధీ మార్గ్ కళకళలాడుతోంది. ఈ మార్గంలో రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్ మంగళవారం చేపట్టారు. కోవిడ్ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయిలో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పరేడ్‌లో 50 కంటింజెంట్లు పాల్గొంటున్నాయి. పోలీసులు, సాయుధ బలగాలు, కమాండోలు, ఆంధ్రా పోలీసు దళం, పౌరులు సహా మొత్తం 50కు పైగా బలగాలు పాల్గొంటున్నాయి. డేర్ డెవిల్ షో, ఒడిశా స్కేటింగ్ అకాడమీ బృందాలు ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. రాష్ట్ర జానపద కళలు, సంప్రదాయ వాయిద్యాలు, పులి నృత్యం, గుర్రపు నృత్యం తదితర ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

భద్రతా దళాల పర్యవేక్షణ

భువనేశ్వర్ డీసీపీ భద్రతా వ్యవస్థని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. గాంధీమార్గ్‌లో మూడంచెల భద్రతా ఏర్పాట్లు మధ్య ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. 30 ప్లాటూన్ల పోలీసులతో 200 మంది అధికారులను మోహరిస్తారు. ఈ ఏడాది కవాతుకు కెసింగా ఎస్‌డీపీవో ఎస్.ప్రతాప్ శ్రీమల్ నాయకత్వం వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఆయనతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విశిష్ట అతిథిగా గణతంత్ర వేడుకలకు హాజరవుతారు.



ఒడిశా స్కేటింగ్ అకాడమీ బృందాల గణతంత్ర పరేడ్ ప్రదర్శన సాధన

ట్రాఫిక్ ఆంక్షలు

గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 26వ తేదీన జంట నగరాల్లో భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. స్థానిక మహాత్మాగాంధీ మార్గ్‌లో రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ పరేడ్ జరుగుతుంది. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ మార్గ్‌కు వెళ్లే అన్ని దారులు మూసివేస్తారు. పాదచారులకు మాత్రమే అటువైపు వెళ్లడానికి అనుమతిస్తారు. ఉదయం 6.30 గంటల నుంచి కవాతు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు నిరవధికంగా కొనసాగుతాయి. రామ మందిరం - రాజమహల్ ఛక్ జనపథ్ మార్గం, హౌసింగ్ బోర్డు క్రాసింగ్ వైపు నుంచి రవీంద్ర మండపం, ఏజీ స్క్వేర్ మరియు జయదేవ్ భవన్ క్రాసింగ్ నుంచి పీఎంజీ స్క్వేర్, 120ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ క్రాసింగ్ నుంచి యూనిట్-4 మార్గాల్లో వాహనాల రవాణాకు ఆంక్షలు విధించినట్లు ప్రకటించారు.

ఉత్కళాంధ్ర మైత్రి

గణతంత్ర వేడుకల్లో ఉత్కళాంధ్ర మైత్రికి ప్రాధాన్యత కల్పించడం విశేషం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఒడిశా పోలీసు బృందం, ఆంధ్రప్రదేశ్ పోలీసు దళం స్థానిక రాష్ట్రస్థాయి గణతంత్ర వేడుకల్లో పాల్గొంటున్నాయి. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు ఏటా ఆంధ్ర, ఒడిశా పోలీసులు గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- వంతెన ఏర్పాటుకు శంకుస్థాపన



రోడ్డు, వంతెన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రఘునాథ్

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మాళపడ పంచాయతీ బనువగుడ గ్రామానికి మంచి రోజులు వస్తున్నాయి. గ్రామానికి వెళ్లేందుకు నదిని దాటుకుంటూ అనేక దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నదిపై రూ.9 కోట్లతో వంతెన, రోడ్డు నిర్మాణానికి కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చేందుకు పనులు ప్రారంభిస్తున్నామన్నారు. రోడ్డు, వంతెన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బొయిపరిగుడ సమితిని పూర్తిగా అభివృద్ధి చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త, ఉపాధ్యక్షురాలు పూర్ణిమ బారిక్, జిల్లా పరిషత్ సభ్యురాలు రాజేశ్వర మహురియ, మాళపడ పంచాయతీ సర్పంచ్ గంగా మాసియ, సమితి సభ్యులు లక్ష్మణ మళపాడియ, పూజారిగుడ సర్పంచ్ సత్య మఝి, దొరాగుడ సమితి సభ్యులు త్రిలోచన జెన, బొయిపరిగుడ సమితి బీడీవో అభిమన్య కవి సనాపతి తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌తో గబాన్ ప్రభుత్వం ఒప్పందం

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ ఆఫ్రికా దేశంలోని గబాన్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు వర్సిటీ మెయిన్ క్యాంపస్ బోర్డు రూములో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఏవోఎం గ్లోబల్ దక్షిణాఫ్రికా, రాజేష్ పారిక్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం గబాన్‌లో సెజ్‌లోని 500 హెక్టార్లలో ఐదేళ్లపాటు ప్లాంటేషన్, పండ్ల తోటల పెంపకం, రాగులు, మొక్కజొన్న, అల్లం, మిరియాలు పండించడమే కాకుండా, కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలు, శాటిలైట్ సిస్టం నిర్మిస్తామని వెల్లడించారు. గబాన్ దేశంలో రానున్న రోజుల్లో మెరైన్ ఇంజినీరింగ్, స్కిల్ డవలప్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్ రంగాల్లో సెంచూరియన్ వర్సిటీ సేవలను విస్తరించనున్నట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు పేర్కొన్నారు. గతేడాది ఫిబ్రవరిలో పీఎం నరేంద్రమోదీ ఆఫ్రికాలో మోరోకో, గబాన్‌లో పర్యటించారు. అలాగే ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఇతర ప్రతినిధులు ప్రైవేటు వర్సిటీలు సందర్శించిన సమయంలో ఇండియా-ఆఫ్రికా దేశాల ఒప్పందం జరిగింది. ఆ మేరకు ఒడిశా రాష్ట్రంలోని సెంచూరియన్ వర్సిటీ మెయిన్ క్యాంపస్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో గబాన్ విదేశాంగ రాయబారి సందర్శించనున్నట్లు ఆచార్య డి.ఎన్.రావు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం వంద మిలియన్ల పెట్టుబడులు సెంచూరియన్ మ్యానేజ్‌మెంట్ ఆఫ్రికా దేశంలోని గబాన్‌లో పెట్టనున్నట్టు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడి ఎం.ఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ స్కూల్‌కి చెందిన ఉత్తమ విద్యార్థులు, 5గురు ఫ్యాకల్టీని గబాన్‌కు పంపించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సీఈవో అమిత్ దుల్హానీ, సెంచూరియన్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుప్రియా పట్నాయిక్, వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, వ్యవసాయ విద్యాలయం డీన్ డా.ఎస్.పి.నందా, డా.మోనాలిసా ఘోష్, డా.సుబ్బారావు, డా.జె.అనిల్‌కుమార్, డా.దుర్గాప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు.



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ, గబాన్ ప్రభుత్వం ప్రతినిధులు

డాల్ఫిన్ల లెక్కింపు ప్రారంభం



చిలికా సరస్సులో సంచరిస్తున్న డాల్ఫిన్లు

బరంపురం: ఆసియాలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన చిలికా ఉప్పునీటి సరస్సులో డాల్ఫిన్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. గంజాం జిల్లా అటవీ శాఖ, చిలికా అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సరస్సులో ఉన్న డాల్ఫిన్ల సంఖ్యను ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది లెక్కించడం ప్రారంభించారు. చిలికా సరస్సులో గల సతపడా, కృష్ణప్రసాద్, నూవపడా, బోయికులా, టాంగి, బల్లుగాం రేంజ్‌ల పరిధిలో 10 బృందాలుగా అటవీ అధికారులు, సిబ్బంది విడిపోయి లెక్కింపు చేపడుతున్నారు. లెక్కింపులో అటవీ, పర్యావరణ, చిలికా అభివృద్ధి సంస్థ, వన్య ప్రాణుల సంరక్షణ విభాగాల అధికారులు పాల్గొన్నట్లు చిలికా డివిజినల్ ఫారెస్ట్ అధికారి బి.ఆర్.దాస్ తెలియజేశారు.



చిలికా సరస్సు సత్తపడాలో విన్యాసం చేస్తున్న డాల్ఫిన్లు

'సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: గగణాపూర్‌లోని సేవా పేపర్ మిల్లు పునరుద్ధరిస్తే సమస్యలు పరిష్కరించబడతాయని ఉద్యోగులు, శ్రామికులు ఎంతగానో ఆశించారని, అయితే వారి ఆశలు నెరవేరలేదని కార్మిక నేత, సేవా పేపర్ మిల్లు ప్రథమ యూనియన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ మహంతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్మిక భవనంలో సోమ వారం జరిగిన ప్రథమ యూనియన్ నేతల సమావేశంలో శ్రామికుల సమస్యలపై మాట్లాడారు. యాజమాన్యం ఏవేవో కారణాలతో సరి గా జీతాలు ఇవ్వడం లేదన్నారు. కంట్రాక్ట్ కార్మికులకు నాలుగైదు నెలలకు కూడా జీతాలు ల భ్యంకాని పరిస్థితి ఉందని దుయ్యబట్టారు. శ్రా మిక సంఘాలతో కుదిరిన ఒప్పందాన్ని యాజమాన్యం తుంగలో తొక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే త్వరలోనే నాలుగు యూనియన్లు సమావేశమై భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రదీప్ కుమార్ పంజియ, ప్రదీప్ రథ్, ప్రమోద్ తంజారి, అశ్వినీ మహంతి, సురే ష్ సామంత సింహార్, అలేఖ్ పాత్రో, ఉమాశంకర శతపతి, వామదేవ్ ఖడంగి పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు



అరెస్టైన నిందితుడు డొంబురు బెనియ



నిందితుడు అజయ హరిజన్



పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

జయపురం: గతేడాది అక్టోబర్ నెలలో జరిగిన ఒక దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను జయపురం సదర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి సోమవారం తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌లోని నిమచ జిల్లాకు చెందిన మాలహెడ వ్యాపారి జయపాల్ బంచార్(22) అక్టోబర్ 14వ తేదీన తన ద్విచక్ర వాహనంపై విజయవాడ- రాంచీ 326 జాతీయ రహదారిలో మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లికి వెళ్తున్నాడు. ఆరోజు రాత్రి 8 గంటల సమయంలో జయపురం సమితి పాత్రోపుట్ సమీప అడవిలో కొంతమంది వ్యక్తులు జయపాల్‌ను అడ్డగించి అతడి వద్దనున్న డబ్బులను ఇవ్వమని డిమాండ్ చేశారు. దీనికి అతడు నిరాకరించడంతో సమీప అడవిలోనికి తీసుకెళ్లారు. అక్కడ అతనిపై తీవ్రంగా దాడిచేసి పర్సులో ఉన్న రూ.700 తీసుకున్నారు. ఇంకా రూ.50 వేలు ఇవ్వాలని, లేదంటే విడిచిపెట్టమని హెచ్చరించారు. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి డబ్బు తెప్పించమని డిమాండ్ చేశారు. భయంతో జయపాల్ తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.40 వేలు దుండగుల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అంతేకాకుండా మరో రూ.8,800లు ఫోన్‌పే ద్వారా పంపిచాడు. అనంతరం దుండగులు జయపాల్‌ను విడిచిపెట్టి, విషయం ఎవరికైనా చెబితే చంపుతామని భయపెట్టారు. దుండగుల నుంచి బయటపడిన జయపాల్ 15వ తేదీన జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం మేరకు ఆదివారం జయపురం సదర్ ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో దాడులు జరిపి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైనవారిలో జయపురం సమితి గొడొపాదర్ వాసి డొంబురు బెనియ(27), అజయ హరిజన్(27)లు ఉన్నట్లు తెలియజేశారు. వారి వద్దనుంచి ఫోనుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

బరంపురం: నగరంలోని పాత బస్టాండ్ దగ్గర రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐఐసీ అధికారి సురేష్ కుమార్ త్రీపాఠి తెలిపిన వివరాల మేరకు.. బరంపురం టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న ఒక ఇంటిలో రహస్యంగా జూదం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్ ఆదేశాలతో టౌన్ పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి 8 మందిని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.40,700 నగదు, 6 వాహనాలు, 5 సెల్‌ఫోన్లు, 6 పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేశారు.



అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కల కట్టలు

ఇద్దరు మావోయిస్టులు అరెస్టు

- పక్కా సమాచారంతో పట్టుకున్న భద్రతా దళాలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుసుంపూర్ ప్రాంతంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేసినట్లు దక్షిణ పశ్చిమాంచల్ డీఐజీ రాజేష్ పండిట్ మంగళవారం ప్రకటించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం జానకీనగర్‌లోని రిజర్వ్ పోలీసు కార్యాలయం ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమీప నువాపడా మావోయిస్టు డివిజన్‌లో ఏసీఎంగా పనిచేస్తున్న పూజా మండవి, పార్టీ మెంబర్‌గా పనిచేస్తున్న సముద్ర బాగ్‌లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కుసుంపూర్ ప్రాంతంలో వీరు సంచరిస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాలకు సమాచారం రావడంతో యాంటీ నక్సల్ విభాగ దళాలలైన డీవీఎఫ్, ఎస్‌వోజీ, సీఆర్‌పీఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సివిల్ దుస్తులలో ఉన్న వీరిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా మావోయిస్టులుగా తేలిందన్నారు.

ఇద్దరిపై ఎన్నో కేసులు

చత్తీష్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా మెతేది గ్రామానికి చెందిన పూజా మండవి అలియస్ అనితా 2010లో మావోయిస్టు దళంలో చేరింది. యువతను మావోయిస్టుల్లో చేర్పించడంలో పూజా ఎంతో నేర్పరి. ప్రముఖ నక్సల్ నాయకుడు మల్లా రాజిరెడ్డికి బాడీగార్డుగా పనిచేసింది. 303 రైఫిల్ పేల్చడంలో ఎంతో నేర్పరి. 2019 వరకు మావోయిస్టులకు ఎంతో కీలకమైన అబుజ్ మడ్‌లో పని చేసింది. అనంతరం ఛత్తీష్‌ఘడ్ నుంచి ఒడిశాలోని నువాపడా డివిజన్‌కి బదలీ అయ్యి సీనియర్ నాయకుడు జయరాంకి బాడీగార్డుగా చేరింది. 2020లో ఏసీఎంగా పదోన్నతి పొందింది. అనంతరం తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వైద్యం కోసం వచ్చి పోలీసులకు పట్టుబడింది. పూజాపై ఛత్తీష్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల్లో అనేక కేసులు ఉన్నాయి. అలాగే నువాపడా జిల్లా సినాపల్లికి చెందిన సముద్ర బాగ్ 2017లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఇతనిపై నువాపడా, కలహండి జిల్లాలో ఎన్నో కేసులు ఉన్నాయి. దళాలకు ప్రతికూల వాతావరణంలో ఆహారం, మందులు చేర వేయడంలో నేర్పరి అని డీఐజీ తెలియజేశారు. వీరి అరెస్టులో రాయిఘర్ ప్రాంతంలో మావో కార్యకలాపాలపై గట్టి ప్రభావం పడనుంది. సమావేశంలో నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ ఉన్నారు.



పట్టుబడిన మావోయిస్టులతో డీఐజీ రాజేష్ పండిట్ తదితరులు

మావో నేత అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా కధంగూఢలో ఎన్ఐఏ అధికారులు మావో నేత రంజు ఖీలో అలియాస్ చంటి పార్టీపేరు విశాంత్‌ను అరెస్టు చేశారు. 2012లో చిత్రకొండ ఘట్టీలో బీఎస్ఎఫ్ డీఐజీ బి.కస్వంగ్‌తో పాటు మరో ముగ్గురు జవాన్లను మందుపాతర పేల్చి హతమార్చిన ఘటనలో రంజు ఖీలో కీలక నిందితుడు. అప్పుడు దాడి అనంతరం బీఎస్ఎఫ్ వాహనంలో ఉన్న ఆయుధాలను తీసుకొని పరారయ్యాడు. అయితే 2013లో మల్కన్‌గిరి పోలీసులు అరెస్టు చేశారు. 2016లో బెయిల్ మీద మరలా బయటకి వచ్చి అప్పటినుంచి పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడు. అప్పటి నుంచి ఎన్ఐఏకు కేసును అప్పగించారు. ఎన్ఐఏ వారు దర్యాప్తులో భాగంగా చిత్రకొండలో అరెస్టు చేసినట్లు ఎస్పీ నీతిష్ వాద్వానీ పేర్కొన్నారు. రంజు ఖీలోపై రూ.3 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని బుధవారం ఢిల్లీ తీసుకెళ్లి విచారించనున్నారు.



అరెస్టైన మావో నేత విశాంత్ (చంటి)

క్లుప్తంగా

యువతి అనుమానాస్పద మృతి


యమున

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ రెతంగ్ కాలనీ 36/బీ రైల్వే క్వార్టరులో 23 ఏళ్ల యువతి ఆకస్మిక మృతి కలకలం రేపుతోంది. ఇంటిలో ఇతర కుటుంబీకులు లేని సమయంలో ఆమె మృతి చెందింది. తలుపులు తెరిచి చూసేసరికి ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఉన్నప్పటికీ, నోటి నుంచి నురగలు కక్కిన ఛాయలను గుర్తించడంతో అనుమానాస్పదమైంది. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. జట్నీ ఠాణా ఏఎస్ఐ అహల్య బెహరా ఘటనా స్థలం సందర్శించి అనుమానస్పద మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శవ పరీక్షల కోసం మృతదేహాన్ని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. మృతురాలు ఖుర్దా టౌను ప్రాణనాథ్ కళాశాలలో +3 డిగ్రీ కామర్స్ మూడో సంవత్సరపు విద్యార్థిని పి.యమునగా గుర్తించారు.

జీఎస్టీ అధికారుల దాడులు


షాపులో తనిఖీలు చేపడుతున్న జీఎస్టీ అధికారులు

పర్లాకిమిడి: పట్టణంలోని పలు జ్యూయలరీ షాపుల్లో జీఎస్టీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఒకేసారి తొమ్మిది మంది సభ్యుల బృందం దాడులు చేసి బంగారం, వెండి స్టాకు రిజిస్టర్లు పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తనిఖీలు చేపట్టినట్లు బరంపురం నుంచి విచ్చేసిన ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి మనోజ్‌కుమార్ పాడి తెలియజేశారు.

145 మందికి వైద్య పరీక్షలు


రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి

జయపురం: స్థానిక అగ్రసేన్ భవనంలో అఖిల భారతీయ మార్వడీ యువ మంచ్ జయపురం శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో భాగంగా మధుమేహం, బీపీ, కేన్సర్, దంత పరీక్షలు, రక్తహీనత, న్యూట్రిషన్‌లకు సంబంధించిన వైద్య నిపుణులు 145 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు, బీజేడీ నేత ఈశ్వరచంద్ర పాణిగ్రహి తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ మార్వడీ యువ మంచ్ జయపురం శాఖ అధ్యక్షుడు అరుణ జౌన్, యువ మంచ్ కార్యదర్శి సంజయ అగర్వాల్, క్యాంప్ కో–ఆర్డినేటర్ రోషన్‌గోయల్, విక్రమ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనం, పీడీఎస్ బియ్యంతో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో విజిలెన్స్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామం నుంచి బొలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు వాహనాన్ని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యం 3400 కిలోలు కాగా, రూ.1.20 లక్షలు విలువ ఉంటుందని అంచనా వేశారు. ముద్దాడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ అక్రమ తరలింపు కంటపడింది. ముప్పిడి సాయి, జామి కూర్మారావు, సింహాద్రి శ్రీరామూర్తిలను నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేసి, బియ్యం, వాహనం సీజ్ చేశారు. అనంతరం దర్యాప్తును ఎచ్చెర్ల రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాడిలో విజిలెన్స్ ఎస్ఐ అశోక్, సిబ్బంది రామ్మోహన్, ఉమ, అప్పన్న, పౌరసరఫరా శాఖ అధికారి జాషువా పాల్గొన్నారు.

27న పీసీసీ అధ్యక్షుడి జిల్లా పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పద్మరాజు ఈనెల 27వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మొదటి దశ కశ్మీర్‌లో ముగుస్తుందన్నారు. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుస్తూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విధి, విధానాలు వివరిస్తామన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

కొరాపుట్:

జిల్లాలో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అలాగే నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల నుంచి బయటపడిన 10 మంది బాలికలకు ఏడీఎం భాస్కర్ రైతా అవార్డులు అందజేశారు. వారి జీవనోపాధి కోసం ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేస్తుందని హామీ ఇచ్చారు. బాలికల సంరక్షణా రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం జిల్లాలో 10 సమితులు, 2 పురపాలక సంఘాల్లో పర్యటిస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కొరాపుట్: బాలికలతో అధికారులు


పర్లాకిమిడి: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: అమ్మాయిలు ఉన్నత విద్యనభ్యసించి ప్రగతి పథంలో ముందుకు సాగాలని జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సంగ్రాం శేఖర పండా అన్నారు. స్థానిక మహిళా ప్లస్ టూ కళాశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సురక్షా అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, మహా విద్యాలయం ప్రిన్సిపాల్ అంబికా దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో తెగుళ్లపై అప్రమత్తత


జీడిపూతను చూపిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ మెంబరు బత్తిని లక్ష్మణ

మందస: ఉద్దానం రైతులు కొబ్బరి, జీడి పంటలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్దాన వన యూనివర్సిటీ మెంబరు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిని లక్ష్మణ్ కోరారు. ఇటీవల ఉద్దానంలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ నిపుణులు పర్యటించారు. టెక్నీషీయన్లు గుర్తించిన తెగుళ్ల గురించి లక్ష్మణ్‌కు వివరించారు. దీంతో ఆయన మంగళవారం ఉద్దానం తోటల్లో పర్యటించి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు.

పంటలకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. లమిడాసైలాత్రిన్ 2.5 సీసీ 250 మిల్లీలీటర్లు, అగ్రిప్రో 250 గ్రాములు, జింక్‌మాగ్ 250 మిల్లీలీటర్లు 200 లీటర్లు ఉన్న పెద్ద డ్రమ్ములో ఈ మూడు రసాయనాలను వేసి, బాగా కలపాలన్నారు. ఈ రసాయనాన్ని జీడిపంటకు స్ప్రే చేయాలని సూచించారు. పూత రావడానికి ముందు, పూత వచ్చిన అనంతరం కూడా రెండు సార్లు స్ప్రే చేయాలన్నారు. ప్రస్తుతం ఈ విధానం ఉద్దానం రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ఇతర తెగుళ్లు రాకుండా కాపాడుతుందన్నారు. ఏరీస్ ఆగ్రో సంస్థ సీనియర్ మేనేజరు కె.కృష్ణారావు, ఎక్స్‌టెన్షన్ అధికారి జి.రాజా సూచనల మేరకు రైతులు ఈ పద్ధతులు పాటించాలన్నారు. పలాస, హరిపురం, సోంపేట ప్రాంతాల్లో ఈ మందులు లభ్యమవుతాయని పేర్కొన్నారు. రైతుల సందేహాలను సంస్థ ప్రతినిధులు నివృత్తి చేశారని తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జుత్తు నారాయణరావు, గుంటు లింగరాజు, జుత్తు పాపారావు, బత్తిని మాధవరావు, రైతులు బత్తిని ఉమాపతి, పూజారి కామయ్య, తాడాల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెల్లివెత్తిన వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిథా తదితరులు

బరంపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కలెక్టర్ దివ్యజ్యోతి పరిథా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వందలాది మంది వినతులు అందజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామల్లో తాగునీరు అందడం లేదని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని, రహదార్లు లేవని, ఉపాధ్యాయుల బదిలీలు తదితర సమస్యలపై వచ్చిన వినతులను అధికారులు స్వీకరించారు. కొన్ని కేసులకు కోర్టుని ఆశ్రయించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సోనా జెన్న, బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్, బరంపురం సబ్ కలెక్టర్ దిగంతా రౌత్రాం తదితరులు పాల్గొన్నారు. .

పట్టపగలు ఇంట్లో చోరీ


టెక్కలి రూరల్: స్థానిక కొప్పల అప్పన్న నగర్‌లోని ఓ ఇంటిలో మంగళవారం పట్ట పగలే దొంగతనం జరిగింది. ఈ ప్రాంతంలో మల్ల రాంబాబు అతని భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు సుకేష్‌తో కలసి నివాసముంటున్నారు. రాంబాబు అతని భార్య రెండు రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి సుకేష్ ఒక్కడే ఇంటిలో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు సుకేష్ పనిమీద బయటకు వెళ్లాడు. తిరిగి 10 గంటల సమయంలో వచ్చిచూసే సరికి తలుపు తాళాలు బద్దలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది. అందులో కొంత నగదు, ఆరు వెండి ప్లేట్లు, ఆరు గ్లాసులు, 500 గ్రాముల కంచం దొంగిలించారని సుకేష్ చెబుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న టెక్కలి ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీమ్ ఆధారంగా తనిఖీలు చేపట్టారు. సుకేష్ తల్లిదండ్రులు ఇంటికి వస్తే ఏమేం పోయాయో పూర్తిగా తెలుస్తుందని అన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

లావేరు: మండలంలోని కేశవరాయునిపురం, జీజీ వలస, లావేటిపాలేం గ్రామాల్లో మంగళవారం ఫారె స్టు అధికారులు పర్యటించి అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మండలంలోని జీజీ వలస, కేశవరాయునిపురం, లావేటిపాలేం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను రాత్రి సమయాల్లో అడవి పందులు వచ్చి ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సాక్షిలో వార్తా కథ నం ప్రచురితం కావడంతో ఫారెస్టు ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం ఫారెస్టు డిప్యూ టీ రేంజర్ ఆర్.అప్పలనాయుడు, బీట్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరావు మండలంలోని కేశవరాయునిపురం, జీజీ వలస, లావేటిపాలేం గ్రామాల్లో పర్యటించి అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అడవి పందుల బెడద లేకుండా చేయాలని, పాడు చేసిన పంటకు నష్టపరిహారం వచ్చేలా చేయాలని రైతులు ఫారెస్టు అధికారులను కోరారు.

ఓటరూ మేలుకో..!

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- జిల్లాలో 18,26,018 మంది ఓటర్లు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ ఓటర్ల దినోత్సవానికి జిల్లా సిద్ధమైంది. బుధవారం ఉదయం పది గంటలకు నగరంలోని బాపూజీ కళా మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నమోదు సమ్మరీకి సంబంధించి సవరించిన ఓటర్ల జాబితా సిద్ధమైంది. దీని ప్రకారం జిల్లాలో 18,26,018 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,09,559 మంది కాగా, స్త్రీలు 9,16,257 మంది, ఇతరులు 202 మంది ఉన్నారు. ఈ సమ్మరీలో 18, 19 సంవత్సరాల వారు జిల్లాలో 16,003 మంది కొత్తగా నమోదయ్యారు.

వయస్సుల వారీగా ఓటర్లు	
18 –19 సంవత్సరాలు వయస్సు వారు	16,003
20–29	2,92,141
30–39	4,95,360
40–49	3,86,746
50–59	2,99,578
60–69	1,97,182
70–79	1,04,069
80 ఆ పై వయస్సువారు	34,939

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	127127	132564	21	259712
పలాస	103350	106785	42	210177
టెక్కలి	117860	116728	18	234606
పాతపట్నం	112588	112060	17	224665
శ్రీకాకుళం	130814	132181	39	263024
ఆమదాలవలస	94246	95038	23	189307
ఎచ్చెర్ల	120467	117507	25	237999
నరసన్నపేట	103107	103394	17	206518
మొత్తం	909559	916257	202	1826018

నియోజవర్గాల వారీగా కొత్త ఓటర్లు	
ఇచ్ఛాపురం	2337
పలాస	1443
టెక్కలి	2849
పాతపట్నం	1855
శ్రీకాకుళం	2325
ఆమదాలవలస	1404
ఎచ్చెర్ల	1896
నరసన్నపేట	1894
మొత్తం	16003

ఫిబ్రవరి 1న శాలిహుండం గిరి యాత్ర


గోడ పత్రికను విడుదల చేస్తున్న ఎంపీపీ రఘురామ్, ధర్మకర్త సుగ్గు మధురెడ్డి

గార: శాలిహుండం వేణుగోపాలస్వామి గిరి యాత్ర ఫిబ్రవరి 1వ తేదీ భీష్మ ఏకాదశి సందర్భంగా నిర్వహిస్తున్నామని ఎంపీపీ గొండు రఘురాం, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ఆలయంలో కరపత్రికలు విడుదల చేశారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు స్వామి ఉత్సవాలు జరుగుతాయన్నారు. 31వ తేదీ మంగళవారం సాయంత్రం స్వామి తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత నిజరూప దర్శనం, వేకువన క్షీరాభిషేకం, అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులకు సమీప వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు, అనంతరం స్వామి దర్శనాలు ఉంటాయని తెలిపారు. 5వ తేదీ పౌర్ణమి నాడు స్వామి తిరుక్కల్యాణ మహోత్సవం, పుష్పయాగం జరుగుతందన్నారు. భక్తుల కోసం అన్ని శాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రతినిధి అరవల రామకృష్ణ, సర్పంచ్‌లు మార్పు పృథ్వీరాజ్, గుండ భాస్కరరావు, కొంక్యాణ ఆదినారాయణ, గొల్లంగి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి. కొయ్యాణ నాగభూషణం, జల్లు గౌరపతినాయుడు, శిమ్మ ధర్మరాజు, చింతల గడ్డెయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన విద్యార్థులు


డిబేటింగ్‌లో పాల్గొన్న విద్యార్థి

పర్లాకిమిడి: స్థానిక మహారాజా కృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఒడిశా స్కూల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆథారిటీ (ఓఎస్ఈపీఏ) ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని సెంచూరియన్ పబ్లిక్ స్కూల్, సరస్వతీ శిశుమందిర్, సెయింట్ జోసెఫ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా రాష్ట్రపతి ఆవార్డు గ్రహీత ఉపాధ్యాయుడు బినోద్ జెన్నా, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయురాలు ఆశాలత అమ్మన్నలు వ్యవహరించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులను అందజేయనున్నట్లు బినోద్ జెన్నా తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న శ్రీకాకుళం–నెల్లూరు బాలికల జట్టు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి 13 జట్లు, బాలికల విభాగం నుంచి 13 జట్లు పాల్గొంటున్నాయి. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విజయనగరం–కృష్ణా జిల్లాల జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 61–25 పాయింట్ల తేడాతో విజయనగరం జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం–నెల్లూరు మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 32–15 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం బాలికల జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరింది. అలాగే బాలుర విభా గంలో విశాఖపట్నం–చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 44–18 పాయింట్ల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం–నెల్లూరు జట్ల నడుమ జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 50–19 శ్రీకాకుళం బాలుర జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో మిగతా జట్ల మధ్య పోటీలు సాగాయి. సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న ఎనిమిది బాల, బాలికల జట్లకు బుధవారం ఉదయం 9గంటల నుంచి పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పోటీలను పర్యవేక్షించారు.

'ఎగ్'స్ట్రా కేర్ తీసుకోవాల్సిందే..!

- పర్యవేక్షణ లేక పాడైపోతున్న అంగన్‌వాడీ గుడ్లు
- ఇరుకు గదుల్లో నిల్వ


గుడ్లు నిల్వ చేస్తున్న రేకుల షెడ్డు

కోటబొమ్మాళి: ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లను పలు చోట్ల సక్రమంగా నిల్వ చేయడం లేదు. ఫలితంగా పలు చోట్ల గుడ్లు పాడైపోయి ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతోంది. ప్రతి నెలా జిల్లా నుంచి కోటబొమ్మాళి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలోని 218 అంగన్‌వాడీ కేంద్రాలకు, అలాగే టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, జలుమూరు మండలాల పరిధిలోని 506 ప్రభుత్వ పాఠశాలకు గుడ్ల సరఫరా జరుగుతోంది. అయితే ఇక్కడ కాంట్రాక్టర్ నుంచి కోటబొమ్మాళికి చెందిన ఒక వ్యక్తి అనధికారికంగా ఈ గుడ్ల సరఫరా బాధ్యతను తీసుకున్నారు. శ్రీకాకుళం నుంచి వస్తున్న గుడ్లను స్థానికంగా ఇరుకైన ఒక రేకుల షెడ్డులో నిల్వ ఉంచుతూ ఆ తర్వాత అంగన్‌వాడీలు, పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. అయితే రేకుల షెడ్డులో నిల్వ ఉంచుతుండడంతో చాలా వరకు గుడ్లు పాడైపోతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుడ్లు పాడైపోయి నష్టం వస్తోందని వారంటున్నారు. ఈ విషయమై స్థానిక అంగన్‌వాడీ ఇన్‌చార్జి పీఓ వై.లావణ్య వద్ద ప్రస్తావించగా రేకు షెడ్డులో గుడ్లు నిల్వ ఉంచడం వాస్తవమేనని, అంగన్‌వాడీ పీడీ దృష్టికి తీసుకువెళ్లి భవనం మార్పు చేయిస్తామన్నారు. డీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్తామని స్థానిక ఎంఈఓ గోవింద తెలిపారు.

ఎందుకిలా..?

- వర్సిటీ న్యాయ విద్యలో నిలిచిపోయిన మొదటి విడత ప్రవేశాలు
- అఫిలియేషన్ కళాశాలలో మాత్రం ప్రవేశాల నిర్వహణ


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలలో మొదటి ఏడాది ప్రవేశాలు నిలిపివేశారు. డిసెంబర్‌లో మొదటి విడత, జనవరి 20, 21 తేదీల్లో ఏపీ లాసెట్–2022 కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు కౌన్సెలింగ్‌ల్లోనూ ప్రవేశాల నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి ఇవ్వలేదు. ఆంధ్రా విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంగా ఉన్నప్పటి నుంచి ఇక్కడ లా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులు నిర్వహించాలంటే బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉండాలి. 2008లో వర్సిటీ ఏర్పాటు తర్వాత కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకుంటే.. 2009లో బీసీఐ బృందం కాలేజీని పరిశీలించింది. ప్రత్యేక కళాశాల, ప్రిన్సిపాల్, రెగ్యులర్ బోధన సిబ్బంది, ప్రత్యేక లైబ్రరీ వంటి సౌకర్యాలు ఉండాలని కమిటీ గుర్తింపు ఇవ్వలేదు. అయితే ఇది ప్రభుత్వ కాలేజీ కావడంతో ఇప్పటికీ కొనసాగుతోంది. కానీ ఈ ఏడాది మాత్రం ప్రవేశాలు నిలిపివేశారు.

గత ఏడాది నవంబర్‌లో బీసీఐ కమిటీ సందర్శన కోసం రూ. 8.50 లక్షలు వర్సిటీ డీడీ చెల్లించింది. కమిటీ సందర్శనకు రాలేదు. మరో పక్క ఆన్‌లైన్ సందర్శన చేస్తామని సమాచారం ఇచ్చారు. అయినా కమిటీ వర్చువల్ సందర్శన చేయలేదు. లా కోర్సులో గతంలో 80 సీట్లు ఉండేవి. ప్రస్తుతం విద్యా ప్రమాణాల కోసం 40కి కుదించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి 44 సీట్లు నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్యా మండలి దృష్టికి అధికారులు సమస్య తీసుకువెళ్లారు. బీసీఐ గుర్తింపు జాబితాలో లేని కారణంగా ప్రవేశాలు నిలిపివేసినట్లు ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది. మరో పక్క బీసీఐ గుర్తింపు పత్రం అందజేస్తే ప్రవేశాలకు అనుమతిస్తామని తెలిపారు. బీసీఐ మాత్రం ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు ముందుకు రావటం లేదు. ఉన్నత విద్యా మండలి అనుమతితో ప్రవేశాలు నిర్వహించాలని సూచిస్తోంది. దీంతో లా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రైవేట్ కళాశాలలకు అనుమతి..

2012 నుంచి శ్రీకాకుళం పట్టణంలోని ఎంపీఆర్ న్యాయ కళాశాలకు బీఆర్ఏయూ అనుబంధ కళాశాల గుర్తింపు ఇస్తోంది. అంతకు ముందు ఏయూ అనుబంధంగా ఉండేది. విశ్వ విద్యాలయంలోని పీజీ సెంటర్ సైతం ఏయూ అనుబంధంగా కొనసాగుతుండేది. ఎంపీఆర్ న్యాయ కళాశాలకు బీఆర్ఏయూ అఫిలియేషన్ మంజూరుతో పాటు పరీక్షల నిర్వహణ, ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేది. పరీక్షలు, వైవా వాయిస్‌లు సైతం వర్సిటీలో చేసేవారు. ఇప్పుడు ఎంపీఆర్ కళాశాలకు సంబంధించి గుర్తింపు ఎవరు మంజూరు చేస్తారు, పరీక్షలు ఎవరు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏయూ పరీక్షలు నిర్వహిస్తుందా? గుర్తింపు బీఆర్ఏయూ మంజూరు చేసి పరీక్షలు నిర్వహిస్తుందా అన్నది అయోమయంగా ఉంది. మరో పక్క తక్షణ ప్రవేశాల అనుమతి కోసం వర్సిటీ అధికారులు ఉన్నత విద్యా మండలిని కోరుతున్నారు.

తీవ్రంగా ప్రయత్నించాం



వర్సిటీలో ప్రవేశాల కోసం తీవ్రంగా ప్రయత్నించాం. బీసీఐకి రూ. 8.50 లక్షల ఫీజు కూడా చెల్లించాం. వర్చువల్ సందర్శనకు సైతం అనుమతి కోరాం. ఉన్నత విద్యా మండలి అనుమతిలో ప్రవేశాలు నిర్వహించాలని బీసీఐ చెప్పింది. బీసీఐ నుంచి అనుమతి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ఉన్నత విద్యా మండలి కోరింది. ఇలా ప్రవేశాలు జరగలేదు. 2012 నుంచి వర్సిటీ ఎంపీఆర్ కళాశాలకు అఫిలియేషన్ మంజూరు చేస్తోంది. అలాంటిది ఏయూ అఫిలియేషన్ అంటూ ఎంపీఆర్‌లో ప్రవేశానికి అవకాశం ఇచ్చారు. వర్సిటీలో ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నాం. బీసీఐ గుర్తింపు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలాపాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్

మెంటాడ: మండలంలోని ఉద్దంగి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఫిరోజ్‌ను విధుల్లో అలసత్వం వహిస్తున్న కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీడీఓ తివిక్రమ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కేఎల్‌వలస పంచాయతీ పరిధిలోని కొన్ని గ్రామాల్లో హౌసింగ్ బిల్లుల మంజూరుకు ఆ గ్రామాలకు వెళ్లకుండా విధుల్లో అలసత్వం వహించినందుకు గాను చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అలాగే మండలంలో కొంతమంది సచివాలయ సిబ్బందిపై ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బంది విషయాన్ని కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు.

వైద్యారోగ్యశాఖలో మిగులు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఎస్ఎన్‌సీయూ, ఆర్‌కేఎస్‌కేల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌సీయూలో సెక్యూరిటీ గార్డుపోస్టు-1ఎస్టీ (మేల్) ఎక్స్ సర్వీస్‌మన్, సైక్రియాటిక్ సోషల్‌వర్కర్ పోస్టు-1 (ఎస్సీ మహిళ),ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ పోస్టు-1 (ఎస్సీ మహిళ)కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 25 వతేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి 13 జట్లు, బాలికల విభాగం నుంచి 13 జట్లు పాల్గొంటున్నాయి. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విజయనగరం -కృష్ణా జిల్లాల జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 61-25 పాయింట్ల తేడాతో విజయనగరం జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 32-15 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం బాలికల జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరింది. అలాగే బాలుర విభాగంలో విశాఖపట్నం-చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 44-18 పాయింట్ల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు జట్ల నడుమ జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 50-19 శ్రీకాకుళం బాలుర జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో మిగతా జట్ల మధ్య పోటీలు సాగాయి. సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న ఎనిమిది బాల, బాలికల జట్లకు బుధవారం ఉదయం 9గంటల నుంచి పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పోటీలను పర్యవేక్షించారు.

31న మినీ జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: ఈనెల 31న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేయభేరి ఆటో మొబైల్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెంటోర్స్, టెక్నీషియన్ పోస్టులకు ఇంటర్మీడియెట్, ఐటీఐ డీజిల్ మెకానిక్, ఆటోమొబైల్స్‌లో డిగ్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. పార్వతీపురం, బొబ్బిలి, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18నుంచి 25సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు హాజరు కావచ్చని సూచించారు. అపోలో ఫార్మసీ కంపెనీలో ఫార్మసిస్టు, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు ఫార్మసీ సర్టిఫికెట్ పొందిన వారు, పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని స్పష్టం చేశారు. ఈ ఉద్యోగాలు విశాఖపట్నం, విజయనగరంలలో కల్పిస్తామని, ఈ పోస్టులకు వయస్సు 18 నుంచి 30 సంవత్సరా ల మధ్య వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9494777553, 6303493720 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

భక్తజన శంబరం



- కొండగుడిలో వైభవంగా సాగిన పోలమాంబ సిరిమాను సంబరం
- తిలకించిన రెండు లక్షలమంది భక్తులు
- అధికారుల కృషితో సాఫీగా సాగిన సిరిమాను తిరువీధి
- భక్తుల జయజయ ధ్వానాలు
- అమ్మవారి ఆశీస్సులు అందించిన సిరిమాను పూజారి



చదురుగుడినుండి తీసుకువస్తున్న అమ్మవారి ఘటాలు

మక్కువ: మంగళ వాయిద్యాలు.. భక్తుల జయజయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగా వైభవంగా సాగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో శంబర గ్రామం భక్త సంద్రంగా మారింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు తరలివచ్చిన వేళ భక్త జనం పులకించింది. అమ్మవారికి మనసారా ప్రార్థనలు చేసింది. మొక్కుబడులు చెల్లించింది. అమ్మవారి ఆశీస్సులు అందుకుంది.

దారులన్నీ శంబర వైపే...

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏ దారి చూసినా శంబర వైపే సాగాయి. శంబర సమీప గ్రామాల ప్రజలకు కాలినడకన చేరుకోగా, దూర ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, బైక్‌లు, సొంత కార్లపై చేరుకున్నారు. గోముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆరాధ్య దైవం పోలమాంబను దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చీరలు, కోళ్లు, పొట్టేళ్లు చూపించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి మూడు గంటల మధ్యలో సిరిమానోత్సవాన్ని ప్రారంభించాలని భావించిన అధికారులు... అనుకున్న సమయానికి సిరిమానోత్సవాన్ని ప్రారంభించలేకపోయారు. ఘటాలను తీసుకురావడంలోను, అమ్మవారికి మొక్కుబడిగా చూపించే మేకపోతును తేవడంలో కాస్త ఆలస్యం కావడంతో మధ్యాహ్నం 3.49 గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు. దీంతో ఏటా నిర్వహించిన సమయంకన్నా కాస్త ఆలస్యంగా సిరిమానుతిరువీధి ప్రారంభమైంది. అంతకు ముందు జన్నివారి ఇంటి నుంచి ఘటాలను అమ్మవారి ఆలయంలోకి తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం సిరిమాను ఉండే ప్రదేశానికి తీసుకెళ్లారు. ప్రధాన ఆలయం నుంచి అమ్మవారు వచ్చే మార్గంలో నేలపై పలువురు భక్తులు చీరలను పరిచి చిన్నారులను ఉంచి అమ్మవారి ఘటాలను దాటించారు. జన్నివారి ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను గిరడ వారింటికి, ఆ తరువాత మునసబు, కరణం ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేశారు. అక్కడ నుంచి పనుకువీధి, గొల్లవీధి, జన్నివీధుల మీదుగా సిరిమాను తిరువీధి సాగి చివరకు ప్రధానాలయం వద్దకు చేరుకుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తుల తాకిడి ఉదయం 11.30 గంటల నుంచి ప్రారంభమైంది. సిరిమానోత్సవ సమయానికి లక్షలాది మంది భక్తుల రాకతో శంబర గ్రామం కిటకిటలాడింది. వీధులన్నీ జనంతో నిండిపోయాయి. గ్రామంలోని మేడలపై నుంచి అమ్మవారిని కనులారా వీక్షించారు.



చదురుగుడినుండి తీసుకువస్తున్న అమ్మవారి ఘటాలు

ఫలించిన అధికారుల కృషి...

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి క్యూలైన్లు ఏర్పాటు, బస్సుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు పక్కాగా అమలు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఉదయం 11.30 గంటల తర్వాత అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు సరిపడకపోవడంతో ఎండలోనే నిల్చొన్నారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు భక్తులకు తాగునీటిని అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, ఆర్డీఓ హేమలత, దేవదాయశాఖ ఉపకమిషనర్ ఎస్.సుజాత, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, డీఎస్పీలు జగదీశ్వరరావు, సుబాష్, నళిని ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యూ లైన్లకు సమీపంలో తలనీలాలు సమర్పించేందుకు, అక్కడకు సమీపంలోనే కోళ్లు, గొర్రెలు మొక్కులు తీర్చుకొనే ఏర్పాట్లు చేయడం భక్తులకు సమయం కలిసొచ్చింది.

పోలీసుల పర్యవేక్షణ భేష్..

అమ్మవారి జాతరలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది రాకూడదని ఈ ఏడాది భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. రోప్ పార్టీ, స్పెషల్ పార్టీ, క్రైమ్ పార్టీలు ఎవరికి వారిగా విధులు కేటాయించారు. రెండు డ్రోన్ కెమెరాలతో పాటు, 37 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సిరిమాను వద్ద రోప్ పార్టీ భక్తుల తోపులాటలు జరగకుండా నివారించింది. సిరిమాను తిరిగే అన్ని వీధుల్లోనూ ఏఎస్పీ పర్యవేక్షించారు. ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, డీఎస్పీలు జగదీశ్వరరావు, సుభాష్, నళిని, సాలూరు సీఐ ధనంజయరావు జాతర సాఫీగా సాగేందుకు కృషిచేశారు.

అమ్మవారి సేవలో డిప్యూటీ సీఎం



శంబర పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర దర్శించుకున్నారు. ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

సిరిమానోత్సవం సాగిందిలా..

- జన్నివారి ఇంటి నుండి, చదురుగుడికి చేరుకున్న అమ్మవారి ఘటాలు
- అమ్మవారి ఆలయం నుంచి, సిరిమాను ప్రదేశానికి బయల్దేరిన ఘటాలు
- లయం నుంచి పూజారి జన్నిపేకావు రామారావును భక్తులు భుజాలపై ఎత్తుకుని సిరిమాను తిరిగే ప్రదేశానికి తీసుకువచ్చారు.
- సిరిమానోత్సవం ప్రారంభమైంది.
- తిరిగి ముగిసింది.

సైడ్ లైట్స్

- భక్తుల రద్దీ దృష్ట్యా చదురుగుడిలో అన్నదాన విరాళాలు సేకరించవద్దని పోలీసులు చెప్పడంతో దేవదాయశాఖ అధికారులు గుసగుసలాడారు.
- చదురుగుడి క్యూలైన్ల వద్ద సప్తస్వరాలయం స్కూల్‌ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- సత్యసాయిసేవాసమితి సభ్యులు భక్తులకు మంచినీటిని అందించారు.
- గజపతినగరం మండలం పారిశుద్ధ్య కార్మికురాలు సొమ్మసిల్లి పడిపోవడంతో 108లో శంబర పీహెచ్‌సీకి తరలించారు.
- రెండు డ్రోన్ కెమెరాలతో జాతరను పోలీసులు పర్యవేక్షించారు.

భక్తులకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు

భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఈ ఏడాది ఆర్టీసీ ఉత్తమ సేవలు అందించింది. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి మంగళవారం సుమారు 150 బస్సులను నడిపింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, వెళ్లే భక్తులకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కొందరు భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారి ఆలయ పరిసరాల్లోని తోటల్లో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.



తల్లితోడుతో జాతరకు వచ్చిన దివ్యాంగురాలు



వంటా వార్పు చేస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరమణ



జాతరలో సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా

అస్సాంపై ఆంధ్రా పైచేయి

- మొదటి ఇన్నింగ్స్‌లో రాణించిన అభిషేక్, హనుమవిహారి



80 పరుగులు చేసిన ఆంధ్రా కెప్టెన్ హనుమ విహారి



ఆంధ్రా- అస్సాం జట్ల జరుగుతున్న రంజీ మ్యాచ్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఆతిథ్య ఆంధ్ర జట్టు మొదటిరోజు సత్తాచాటింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆంధ్ర-అస్సాం జట్ల మధ్య రంజీ మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. టెస్ట్‌మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అస్సాం జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి 37.5 ఓవర్లలో 113 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆంధ్ర బౌలింగ్ లో రాయుడు 12 పరుగులిచ్చి 4 వికెట్లు, కేవీ శశికాంత్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు చేజిక్కించుకుని అస్సాం బ్యాట్స్‌మన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 47 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 160 పరుగులు జోడించింది. బ్యాటింగ్‌లో ఆంధ్రా కెప్టెన్ హనుమ విహారి 123 బంతుల్లో 80, బ్యాట్స్‌మన్ అభిషేక్ రెడ్డి 129 బంతుల్లో 75 పరుగులతో రాణించారు.

27న బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనే బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ కృష్ణ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నెల్లిమర్ల మండలం కొండకరకాం గ్రామంలో గల వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల ఇండోర్ బాక్సింగ్ హాల్‌లో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2004 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి, ఇంటర్, 10,9వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబులెన్స్ ఢీకొని వృద్ధుడి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక జేఎన్‌టీయూ జంక్షన్ సమీపంలో అంబులెన్స్ ఢీకొని కొండకరకాం గ్రామానికి చెందిన పతివాడ నారాయణరావు (71) మంగళవారం మృతి చెందాడు. వృద్ధుడు నారాయణ రావు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో అటుగా వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే అదే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళి కట్టు శుభవేళ..!

- మాఘమాసం ప్రారంభంతో శుభకార్యాల సందడి
- మార్చి వరకు కొనసాగనున్న మంచి ముహూర్తాలు
- వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సిద్ధమవుతున్న జిల్లా ప్రజలు
- అన్ని రంగాల ప్రజలకు ఉపాధి

మంచి మూహూర్తాలు ఇవే:
జనవరి : 25,26, 27,28
ఫిబ్రవరి : 1, 8, 9,10,11,12,15, 16,22, 23, 24, 25
మార్చి : 1, 5, 8, 9,10,11,14, 15, 17, 18, 22, 23, 24, 26
ఏప్రిల్: గురుమూఢమి. ముహూర్తాలు లేవు.



పెళ్లి తంతు దృశ్యం



శుభ కార్యాల్లో వినియోగించే విద్యుత్ వెలుగులు

విజయనగరం: పెళ్లీడుకొచ్చిన యువత ఎదురు చూసే మాఘమాసం వచ్చేసింది. శుభ ముహూర్తాలను తీసుకువచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శుభ కార్యాలను నిర్వహించుకోవడంలో ముహూర్తాలు లెక్కకట్టడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి మాఘమాసంలో మంచి రోజులు ప్రారంభం కావడంతో రానున్న రెండు నెలలు పల్లె, పట్టణం తేడా లేకుండా సందడి వాతావరణం నెలకొంటుంది. శుభకృత్ నామ సంవత్సరంలో చివరి ముహూర్తం మార్చి నెలలో ముగియనుండగా.. ఉగాది అనంతరం మళ్లీ శుభ కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి.

రెండు నెలలు సందడే సందడి

పెళ్లి వయస్సుకు వచ్చిన యువత ఎదురు చూసే మాఘమాసం ప్రారంభం కావడంతో జిల్లాలో బాజాభజంత్రీల మోత మోగనుంది. ఆకాశమంత పందిరి, భూదేవంత పీట వేసి వివాహవేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా గృహప్రవేశాలు చేసేందుకు, నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టేందుకు.. నిశ్చితార్థ మహోత్సవాలు నిర్వహించుకునే వారు ఆయా పనుల్లో ఇప్పటికే నిమగ్నమయ్యారు. ప్రధానంగా వివాహ వేడుకలకు సంబంధించి కల్యాణ మంటపాలకు డిమాండ్ పెరగడంతో వాటిని ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా గిరాకీ లేక వెలవెలబోయిన కల్యాణ మంటపాలకు ప్రస్తుతం డిమాండ్ బాగా ఏర్పడింది.

కళకళ లాడుతున్న మార్కెట్:

శుభ కార్యాల సందడి ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల్లోని ప్రధాన మార్కెట్‌లు కళకళ లాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, చీపురుపల్లి, ఎస్ కోట వంటి ప్రధాన పట్టణాల్లో వస్త్ర వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకే తలమానికంగా నిలిచిన విజయనగరంలోని బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ సందడిగా మారింది. అంతేకాకుండా పెళ్లితంతులో కీలకమైన బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు వచ్చే వారితో విజయనగరం జిల్లా కేంద్రం కళకళ లాడుతోంది.

అన్ని రంగాల ప్రజలకు ఉపాధి

పెళ్లిళ్ల సీజన్‌పై ఆధారపడే పురోహితులు, వంట మేస్త్రీలు, రవాణా, అలంకరణ, బాజాభజంత్రీలు, ఆహ్వాన పత్రికల ముద్రణ, బ్యూటీషియన్లు, క్యాటరింగ్, షామియానాలు, పూలు, పండ్ల వ్యాపారులు, బట్టల దుకాణాలు, నగల షాపులు, దర్జీలు, ఐస్‌క్రీం పార్లర్లు, కూరగాయలు, జనరేటర్ సరఫరాదారులు, లైటింగ్ ఏర్పాట్లు చేసేవారు ఇలా వివిధ రంగాల వారికి రానున్న రెండు నెలలూ చేతి నిండా పని దొరకనుంది.

మంచి ముహూర్తాలు ప్రారంభం



మాఘమాసం ఆదివారం ప్రారంభమైంది. మార్చి మూడవ వారం వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు నెలలు జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్ల, శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు నిర్వహించనున్నారు. అంతేకాకుండా ఈ మాసంలో సూర్యభగవానుడిని ఆరాధిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

– కామేశ్వరశర్మ, వేదపండితుడు